
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 21 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,66,336లు, బంగారం 8 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 45 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మందిరానికి గుర్తింపు

మా మంగళ మందిరానికి ప్రభుత్వ గుర్తింపు వచ్చింది. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. - 8లో



హోంగార్డుపై రాళ్లదాడి

హోంగార్డుపై కొందరు రాళ్లదాడికి పాల్పడ్డారు. ఆయన ఆస్పత్రి పాలయ్యారు. - 8లో

## న్యూస్‌రీల్‌

### ఏనుగుల దాడిలో మహిళకు గాయాలు



ఏనుగుల దాడిలో గాయపడిన మహిళ

రాయగడ: ఏనుగుల దాడిలో ఒక మహిళ గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. జిల్లాలోని కల్యాణసింగుపూర్‌ సమితి పర్శాలి పంచాయతీ తోట గ్రామానికి చెందిన నసితి బెడక అనే మహిళ తన పొలం పనులను ముగించుకుని ఇంటికి అటవీ ప్రాంతంలో నడిచి వస్తున్న సమయంలో ఒక ఏనుగుల గుంపు తారసపడింది. దీంతో భయాందోళనతో ఆమె పరుగులు తీయగా గుంపులోని ఒక ఏనుగు ఆమెపై దాడి చేసింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యాయి. ఏనుగుల దాడిలో గాయపడిన నసితి బెడకను, ఏనుగుల గుంపు ఉన్న ప్రాంతం నుంచి అటవీ శాఖ అధికారులు అతికష్టం మీద తరలించి కల్యాణ సింగుపూర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆమె ప్రాణాలకు ఎటువంటి భయం లేదని వైద్యులు ధ్రువీకరించారు. అయితే ఏనుగుల దాడులు పెరుగుతుండడంతో స్థానికులకు కంటిమీద కునుకు ఉండడం లేదు.

### రూ.10 కోట్ల వితరణ



కలెక్టర్‌కు రూ.10 కోట్ల చెక్కును అందజేస్తున్న నాల్కో అధికారులు

కొరాపుట్‌: కొరాపుట్‌ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్‌ లక్ష్మణ్‌ నాయక్‌ వైద్య కళాశాల అభివృద్ధికి నవరత్న కంపెనీల్లో ఒకటైన భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) రూ.10 కోట్ల వితరణ చేసింది. గురువారం కొరాపుట్‌ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ వి.కీర్తివాసన్‌తో నాల్కో ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. సంస్థ లాభాల్లో వచ్చిన మొత్తంలో రూ.10 కోట్ల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.

### నకిలీ డాక్టర్‌ అరెస్టు



మందులతో నకిలీ వైద్యుడు విద్యాధర్‌

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు గురువారం ఓ నకిలీ వైద్యుడిని అరెస్టు చేశారు. కొన్ని రోజులుగా ఓ నకిలీ వైద్యుడు చిత్రకొండ సమితిలో పాత చమటపల్లి, నీలాకాంబేరు పంచాయతీ పరిధిలోని కొన్ని గ్రామాల్లో వైద్యం చేస్తున్నాడు. ఆయనపై పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న చిత్రకొండ ఎస్‌డీపీఓ ప్రదోష్‌ ప్రధాన్‌ వైద్యుడిపై దర్యాప్తు చేసి వివరాలు సేకరించారు. ఈ నకిలీ వైద్యుడి పేరు విద్యాధర్‌ హాల్దార్‌ (38). ఈయన స్వగ్రామం పాత చిమటపల్లి పంచాయితీ యంవి 120 గ్రామం. 2012 నుంచి 2017 వరకు మల్కన్‌గిరిలో ఓ మెడికాల్‌ స్టోర్‌లో పనిచేసి తనకు తెలిసిన విద్యతో ఇలా డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించారు. తాను ఫార్మసీ చదివానని అతను చెబుతున్నా.. కేవలం 8వ తరగతి మాత్రమే చదివాడని పోలీసులు తెలిపారు. అతడి నుంచి మందులు స్వాధీనం చేసుకున్నారు.

### నేటి నుంచి ఒంటి పూట బడులు

భువనేశ్వర్‌: రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. వేసవి తాపం నేపథ్యంలో పాఠశాలలు, విద్యా సంస్థల్లో తరగతుల వేళల్ని సవరించారు. రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలవుతాయి. విభాగం ఆధీనంలో పని చేస్తున్న విద్యా సంస్థలు అన్నింటికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని విభాగం స్పష్టం చేసింది. వేసవి తాపం నేపథ్యంలో విద్యా సంస్థల్లో చేపట్టాల్సిన జాగ్రత్తల మార్గదర్శకాల్ని విభాగం జారీ చేసింది.

- 1 నుంచి 12వ తరగతి వరకు నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు తరగతుల నిర్వహణ వేళలు.
- విద్యార్థులకు పుష్కలంగా తాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలి.
- విద్యాసంస్థల ప్రాంగణాల్లో మొరాయిస్తున్న గొట్టపు బావులు ఇతరేతర తాగు నీటి వనరుల పునరుద్ధరణ కార్యకలాపాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పునరుద్ధరించాలి.
- అవసరమైతే విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు సరఫరా చేయడం అనివార్యం.

# చద్దన్నం.. చల్లదనం





చిన్నారికి చద్దన్న ప్రాసన



మంత్రి మండలి సభ్యులతో కలిసి పాఖాలో ఆరగిస్తున్న ముఖ్యమంత్రి





పాఖాలో తింటున్న నబరంగ్‌పూర్‌ ఎమ్మెల్యే గౌరీ శంకర్‌ మజ్జి



చద్దన్నం విందు

- 'పాఖొలొ' ఒడియా ఆహార సంస్కృతిలో ఆణిముత్యం

భువనేశ్వర్‌: ప్రపంచ పాఖాలో దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝి, శాసన సభ స్పీకరు సురమా పాఢి, మంత్రి మండలి సభ్యులతో కలిసి పాఖాలో (చద్దన్నం) ఆరగించారు. దేశ, విదేశాల్లో విస్తరించిన ఒడియా ప్రజలు కూడా పాఖాలో దిబొసా వేడుకగా జరుపుకున్నారు. పసి పిల్లలకు చద్దన్న ప్రాసనం కూడ సరదాగా నిర్వహించి ముచ్చట పంచుకోవడం మరో విశేషం.


పాఖాలో ఒడియా ప్రజలకు ఇష్టమైన నిత్య ఆహారం. ప్రతి ఇంటా పాఖాలో ఉంటుంది. ఈ ఆహారం అనాదిగా ఒడియా ప్రజల ఆహార సంస్కృతిలో ఇమిడి పోయింది. రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం విశ్వ విఖ్యాత శ్రీ జగన్నాథునికి కూడా దొహి పాఖాలో (దద్దోజనం) నివేదించడం సనాతన ధర్మ, ఆచారాలకు ప్రతీకగా పేర్కొంటారు. వ్యవహారిక శైలిలో పాఖాలో (చద్దన్నం) శరీరానికి చల్లదనం చేకూర్చుతుందని చెబుతారు.

కొరాపుట్‌: పాఖాలో తినాలని బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్‌ ఎమ్మెల్యే గౌరీ శంకర్‌ మజ్జి పిలుపునిచ్చారు. గురువారం ఉత్కళ పకాలి దినోత్సవం సందర్భంగా తాను పాఖాలో తింటున్న చిత్రం విడుదల చేశారు. వేసవిలో పాఖాలో తినడం వల్ల చల్లదనం చేస్తుందన్నారు.

## దేవమాలి సంరక్షణ మనందరి బాధ్యత



రాజమౌళి షేర్‌ చేసిన ఫొటో



దేవమాలిపై రాజమౌళి

కొరాపుట్‌: భూతల స్వర్గం దేవమాలిపై పాన్‌ ఇండియా దర్శకుడు ఎస్‌ఎస్‌ రాజమౌళి హాట్‌ కామెంట్స్‌ చేశారు. ఒడిశాలోని కొరాపుట్‌ జిల్లా పొట్టంగి సమితి దేవమాలి పర్వత ప్రాంతంపై ఎస్‌ఎస్‌ఎంబీ–29 చిత్ర షూటింగ్‌ పూర్తవ్వడంతో ఆయన తిరుగు ప్రయాణమైన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఇక్కడి అనుభవాలపై ఎక్స్‌ వేదికగా స్పందించారు. భూతల స్వర్గం వంటి దేవమాలిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇటువంటి ప్రదేశంలో తన చిత్ర నిర్మాణం జరుపుకోవడం అద్భుతంగా ఉందన్నారు. తాను మరలా ఇక్కడ సినిమా షూటింగ్‌ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే అక్కడికి వెళ్లే సందర్శకులు చెత్త పారవేయవద్దని సూచించారు. ఎవరు తీసుకొచ్చిన చెత్తను వారు వినియోగించిన తర్వాత, మరలా తామే తీసుకొని వెళ్లేవిధంగా సంచులు తెచ్చుకోవాలన్నారు. దేవమాలి పర్వతం మీద సందర్శకులు వదిలి వెళ్లిన చెత్త ఉన్న వీడియోని షేర్‌ చేశారు. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే ఇకపై దేవమాలిపై కొండపై చెత్త నివారించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. కాగా మరోవైపు షూటింగ్‌ జరిగిన ప్రాంతంలో ఏమైనా చెత్తని వదలి వెళ్లారో లేదో చూడడానికి కొందరు ఆ ప్రాంతానికి వెళ్లారు. అయితే అక్కడ సినిమా యంత్రాంగం యుద్ధ ప్రాతిప్రదికన మిగిలిన వ్యర్థాలను తొలగించడానికి జేసీబీలను ఏర్పాటు చేయడంతో అందరూ అభినందించారు.

## కాంగ్రెస్‌ సభ్యుల వినూత్న నిరసన



శాసన సభ కార్యకలాపాల నిర్వహణలో స్పీకర్‌ సురమా పాఢి



నల్లని పీలికలు ధరించి ఈల గోలతో కాంగ్రెస్‌ సభ్యుల నిరసన

భువనేశ్వర్‌: రాష్ట్ర శాసన సభలో గురువారం వినూత్న నిరసన ప్రదర్శనతో కాంగ్రెస్‌ సభ్యులు గోల చేశారు. మహిళలపై జరుగుతున్న దురాగతాలపై నిరసించారు. మరో వైపు తారా ప్రసాద్‌ బాహినీపతి సస్పెన్షన్‌ను నిలదీసిన ప్రతిపక్ష బిజూ జనతా దళ్‌, కాంగ్రెస్‌ సభ్యుల తీరుతో సభలో గందరగోళం నెలకొంది. సరికొత్తగా కాంగ్రెస్‌ సభ్యులు నల్లని పీలికల్ని ధరించి సభలో ఈల వేసుకుని గోల గోల చేశారు. సభలో ఈల గోల నివారించాలని స్పీకరు చేసిన అభ్యర్థనల్ని సైతం లెక్క చేయకుండా నిరవధికంగా నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో గురువారం శాసన సభ వరుసగా రెండు సార్లు వాయిదా పడింది. శాసన సభ కార్యకలాపాలు విషాదకరంగా ప్రారంభమయ్యాయి. మాజీ బిజూ జనతా దళ్‌ ఎమ్మెల్యే దేబరాజ్‌ సేథ్‌ మృతికి సంతాపంగా ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఒక నిమిషం మౌనం పాటించాలని ప్రతిపాదించారు. ప్రతిపక్ష నాయకుడు నవీన్‌ పట్నాయక్‌, కాంగ్రెస్‌ సభ్యులు కూడా ఈ ప్రతిపాదనకు మద్దతు ప్రకటించారు. అనంతరం మొదలైన ప్రశ్నోత్తరాల సమయంలో గందరగోళం ప్రారంభమైంది. కాంగ్రెస్‌కు చెందిన ప్రతిపక్ష సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్‌ మహాలింగ్‌ ప్రసంగిస్తున్న సమయంలో అనేక మంది కాంగ్రెస్‌ సభ్యులు తమ సీట్ల నుంచి లేచి స్పీకర్‌ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. మరి కొంత మంది సభ్యులు ఈల వేసుకుంటు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. మహిళలపై జరుగుతున్న దారుణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేస్తూ ప్రతిపక్షాలు నినాదాలు చేసిన నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు తారా ప్రసాద్‌ బాహినీపతిని ఇటీవల సస్పెండ్‌ చేయడంపై కాంగ్రెస్‌ సభ్యులు నల్లటి పీలికలు ధరించి తీవ్ర నిరసనలు తెలిపారు. స్పీకర్‌ పదే పదే అభ్యర్థించినప్పటికీ ప్రతిపక్ష సభ్యుల గందరగోళం ఆగకపోవడంతో సభను మొదట మధ్యాహ్నం 12 గంటలకు, మళ్లీ మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేశారు.

### కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవం వాయిదా

జయపురం: ఈనెల 22వ తేదీన జరగాల్సిన కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు గురువారం ప్రకటించారు. వాస్తవానికి సంబల్‌పూర్‌లో శనివారం కేంద్ర హోమ్‌ శాఖ మంత్రి అమిత్‌ షా కార్యక్రమం ఉండేది. దీంతో అదేరోజు కేంద్రీయ విద్యాలయం ప్రారంభించాలని ముందుగా అనుకున్నారు. అయితే ఆయన తన సంబల్‌పూర్‌ కార్యక్రమాన్ని రద్దు చేసుకోవడంతో, ప్రారంభోత్సవం సైతం రద్దయినట్లు నోడల్‌ అధికారి వెల్లడించారు. అయితే తదుపరి తేదీని త్వరలో వెల్లడిస్తామన్నారు.

## చెట్టు కొమ్మ పడి విద్యార్థి దుర్మరణం



మహేంద్ర శవం వద్ద పోలీసులు



విరిగి పడిన చెట్టు కొమ్మను తొలగిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌ బొయిపరిగుడ సమితిలో గురువారం ఒక అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుంది. పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులపై ఎండిన చెట్టు కొమ్మ విరిగి పడి ఒక విద్యార్థి దుర్మరణం చెందగా మిగతా వారు తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారిపై బైక్‌పై ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వెళ్తుండగా ఒక ఎండిన చెట్టు కొమ్మ వారి బైక్‌పై పడింది. ఘటనలో జయపురం సమితి డొంగిరిపంశి పంచాయతీ బరంగపుట్‌ గ్రామానికి చెందిన మహేంద్ర నాయిక్‌ అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. భరిణిపుట్‌ పంచాయతీ నువాగుడ గ్రామానికి చెందిన కమలలోచన హరిజన్‌, మలిగుడ గ్రామానికి చెందిన ధరమ మాలి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కొరాపుట్‌ సహిద్‌ లక్ష్మణ నాయక్‌ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. వీరు డిగ్రీ చదువుతున్నారు. మహేంద్ర మృతదేహానికి పోస్టు మార్టం జరిపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


## మద్యం వ్యాపారుల నివాసాల్లో ఐటీ దాడులు

పర్లాకిమిడి:

స్థానిక సొండివీధిలో మద్యం వ్యాపారులు తిరుపతి సాహుకార్‌, లోకేశ్వర్‌ సాహుకార్‌ నివాసాల్లో గురువారం ఐటీ దాడులు జరిగాయి. వేకువజాము నుంచే భువనేశ్వర్‌ నుంచి ఆదాయపు పన్ను, ఈడీ అధికారులు నేరుగా తెలుగు సొండివీధికి వెళ్లి వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు చేశారు. విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పర్లాకిమిడి మార్కెట్‌ జంక్షన్‌లో జానకీ ట్రేడర్స్‌ షాపులో ఐటీ శాఖ అధికారులు సోదాలు జరిపారు. మూడు కార్లలో అధికారులు వచ్చి దాడులు జరపడం పట్టణంలో సంచలనంగా మారింది. గురువారం ఉదయం నుంచి ఏకలంలో ఢెంకనాల్‌, అనుగుల్‌, భువనేశ్వర్‌, తాల్చేర్‌, పూరీ, కటక్‌, పర్లాకిమిడిలలో సోదాలు జరిగినట్టు ఐటీ అధికారులు తెలిపారు. తొలుత ఢెంకనాల్‌లో తమసింగ పి.ఎస్‌.పరిధిలో శక్తి మాల్టేర్‌ అండ్‌ లిమోనైడ్‌ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్‌, బౌధ్‌లో డిస్టిలరీ కంపెనీలు, ఎం.డీ. విక్రం సాహు కంపెనీలపై దాడులు జరిగాయి. కాగా, ఈ దాడులపై శక్తి మాల్టేర్‌ అండ్‌ లిమోనైడ్‌ ప్రైవేటు కంపెనీ ఎండీ విక్రం సాహు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ఎటువంటి స్పిరిట్‌ తయారు చేయడం లేదని, ఇతర కంపెనీలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. కాగా, జార్ఖండ్‌లో ఓ మద్యం వ్యాపారి ఇంట్లో సోదాలు జరపగా సుమారు రూ.350 కోట్ల విలువైన డబ్బు, బంగారం పట్టుబడటంతో వారితో సంబంధం ఉందంటూ విక్రం సాహు ఇళ్లల్లో ఐ.టీ.శాఖ దాడులు జరిపారు. విక్రం సాహుతో సంబంధం ఉన్న పర్లాకిమిడిలో ప్రముఖ మద్యం వ్యాపారులు నివాసాల్లో కూడా సోదాలు జరపడం విశేషం.



తెలుగు సొండివీధిలో మద్యం వ్యాపారి ఇళ్ల వద్ద ఐటీ అధికారులు



సొండివీధిలో తిరుపతి సాహుకార్‌ ఇంటి వద్ద ఐటీ శాఖ అధికారులు




పర్లాకిమిడి మార్కెట్‌ జంక్షన్‌ వద్ద జానకీ ట్రేడర్స్‌ వద్ద ఐటీ శాఖ దాడులు



తెలుగు సొండివీధిలో మద్యం వ్యాపారి నివాసాలు

## క్లుప్తంగా

### హోంగార్డుపై రాళ్లదాడి


చికిత్స పొందుతున్న దేవేంద్రరాత్

మల్కన్‌గిరి : చిత్రకొండ సమితి పాప్పరమేట్ల పంచాయతీ లిమాతాంగ్ గ్రామంలో అక్రమంగా గంజాయి రవాణా జరుగుతోందని తెలిసి వెళ్లిన పోలీసులపై గ్రామస్తులు రాళ్లదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో హోంగార్డు దేవేంద్ర రాత్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి


ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

రాయగడ: విద్యా విధానాన్ని మరింత మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 2 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో గల అన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే కార్యక్రమాన్ని స్వాగతిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు జిల్లా విద్యాశాఖ సిబ్బంది ఆహ్వాన పత్రికలను పంపిణీ చేస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ చంద్ర నాహక్ నేతృత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, క్లస్టర్ కన్వీనర్లు, విద్యాశాఖ సిబ్బంది గ్రామాల్లో.. 5 నుంచి 6 ఏళ్ల లోపు గల పిల్లలకు బడికి పంపించాలని ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ లోగా ప్రతీ ప్రాంతంలో ఈ ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమం పూర్తి చేసేందుకు విద్యాశాఖ సన్నహాలు చేసింది. ఐదేళ్ల ప్రాయం గల పిల్లలకు నర్సరీలో, ఆరేళ్ల పిల్లలకు ఒకటో తరగతిలో చేర్పించేందుకు తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. ఏప్రిల్ 2 నుంచి 5వ తేదీ వరకు పాఠశాలల్లో పేర్లును నమోదు చేయించుకోవాలని పిలుపునిస్తున్నారు.

### నేత్రదానం స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ- ఏ కాలనీలో నివాసముంటున్న పొట్నూ రు ధర్మరాజు(71) మృతి చెందడంతో ఆయన కుమారుడు పి.వెంకటరమణ, కుమార్తె ఎ.ప్రవీణ, అల్లుడు రమణమూర్తి నేత్రదానానికి ముందుకొచ్చారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి తవుడు ద్వారా విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావుకు తెలియజేయగా నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, పి.సునీతలు హాజరై ధర్మరాజు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్ అభినందించారు. నేత్ర దానం చేయాలనుకునేవారు 7842699321 నంబరును సంప్రదించాలని కోరారు.

### అదనపు వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్ సరఫరా సమయంలో సిబ్బంది అధిక మొత్తం వసూళ్లు చేస్తే పౌర సర ఫరా అధికారులకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ నుంచి వినియోగదారులు ఇంటికి 15 కిలోమీటర్ల పైన దూరం ఉంటే రవాణా చార్జి నిమిత్తం ఒక్కో సిలిండర్‌కు రూ.30 మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. 15 కిలోమీటర్ల లోపు ఉంటే ఎటువంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

కవిటి: మండలంలోని మాణిక్యపురం సమీప కొబ్బరితోట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడిచేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్టు కవిటి ఎస్‌ఐ వి.రవి వర్మ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.8600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

### యోగా అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వం (ఆయుష్ శాఖ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ(విజయవాడ) ఆదేశాల మేరకు 2వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రధానమంత్రి యోగా అవార్డు-2025కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వ్యక్తులు, సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో నామినేషన్లు ఆహ్వానిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వ్యక్తిగత విభాగంలో దరఖాస్తుదారుకు కనీస వయసు 40 ఏళ్లు ఉండాలని, 20 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నాలుగు అవార్డులను జూన్ 21న ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 31తో దరఖాస్తు నమోదు గడువు ముగుస్తుందని తెలిపారు.

# లాభాల బాటలో కేసీసీ బ్యాంక్


సమావేశంలో పాల్గొన్న అధికారులు


మాట్లాడుతున్న ఈశ్వర పట్నాయక్

జయపురం: కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ (కేసీసీ బ్యాంక్) లాభాల బాటలో పరుగులు తీస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల 51 లక్షలు లాభం ఆర్జించింది. ఈ విషయాన్ని స్థానిక కె.సి.సి బ్యాంక్ కేంద్రం కార్యాలయ సభా గృహంలో గురువారం జరిగిన 74వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వెల్లడించారు. కెసిసి బ్యాంక్ చైర్మన్ ఈశ్వర చంద్ర పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల 51 లక్షలు లాభం ఆర్జించిందని, అంతకు ముందు సంవత్సరం కన్నా 5.89 శాతం అధికమని పాణిగ్రాహి వెల్లడించారు. 2025-26లో లాభాలను మరింతగా పెంచేందుకు బ్యాంక్ సిబ్బంది ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంక్ ప్రధాన లక్ష్యం అవిభక్త కొరాపుట్‌లో వ్యవసాయ ప్రగతికి, రైతుల ఆర్థిక ఉన్నతికి చేయూత ఇవ్వడమేనన్నారు. అవిభక్త కొరాపుట్ రాయగడ, నవరంగపూర్, నవరంగపూర్, కొరాపుట్ జిల్లాలో 338 లేంపులు, ఒక మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీలు ఉన్నాయని, కెసిసి బ్యాంక్ ఏర్పడి 75 ఏళ్లు గడిచాయని వెల్లడించారు. నేటికీ బ్యాంక్ సొంత నిధి రూ.175.11 కోట్లకు చేరగా, బ్యాంక్ డిపోజిట్లు రూ.654కోట్ల 63 లక్షలకు చేరిందని వెల్లడించారు. 2023-24 నాటికి ఖరీఫ్ వ్యవసాయానికి 103299 మంది రైతులకు రూ.52,314.04 లక్షలు, రబీ లో 106017 మంది రైతులకు రూ.53586.25 లక్షల వ్యవసాయ రుణాలు అందజేసినట్లు వెల్లడించారు. 1194 స్వయం సహాయక గ్రూప్‌లకు రూ.2393 .94 లక్షలు, బలరాం పథకంలో రూ.366 కోట్లు, బలియ పథకంలో 67 చేనేత పనివారిని రూ.33.50 లక్షలు, మా రుణ పథకంలో 62 మంది లబ్ధి దారులకు రూ.89లక్షలు, మిషన్ శక్తి పథకంలో 469 మంది లబ్ధిదారులకు రూ.457 .07 లక్షల రుణాలు అందించినట్లు తెలిపారు. కేసీసీ బ్యాంక్ కార్యదర్శి అతుల్య కుమార్ మల్లిక్, బ్యాంక్ ఏజీఎం హరికృష్ణ బనగాడి, నాలుగు జిల్లాల బ్యాంక్ శాఖల అధికారులు, బ్యాంక్ డైరెక్టర్లు, సభ్యులు, లేంప్స్ అధికారులు పాల్గొన్నారు.

# రౌర్కెలాలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రతిపాదన


ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసిన రౌర్కెలా మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దిలీప్ రే

భువనేశ్వర్: రౌర్కెలా మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దిలీప్ రే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రితో 3 ముఖ్యమైన అంశాలను చర్చించారు. రౌర్కెలాలో కొత్త రైల్వే మండలం ఏర్పాటు, రౌర్కెలా స్టీల్ ప్లాంట్ (ఆర్‌ఎస్‌పీ) విస్తరణ, రౌర్కెలా విమానాశ్రయం అభివృద్ధి, విస్తరణ పనుల్ని ప్రతిపాదించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో రౌర్కెలా కేంద్రంగా కొత్త రైల్వే మండలం ఏర్పాటు రౌర్కెలా, పరిసర జిల్లాల నుంచి రైల్వేకి గణనీయంగా ఆదాయం పెంచేందుకు దోహద పడతాయి. రైల్వే రంగంలో ఈ ప్రాంతం మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సేవల పరంగా వెనుకబడి ఉంది. మెరుగైన అనుసంధానం దక్షతతో కూడిన నిర్వహణ ఖనిజ నిక్షేప ప్రాంతాల సమతుల్య అభివృద్ధికి ప్రేరణగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో రౌర్కెలా కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్‌ను రూపొందించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రధాన మంత్రిని కోరారు. సెయిల్ ఆధ్వర్యంలో రౌర్కెలా స్టీల్ ప్లాంట్ (ఆర్‌ఎస్‌పీ) విస్తరణ దీర్ఘకాలంగా మొరాయిస్తుంది. భూ సేకరణ సవాళ్ల కారణంగా వేగవంతంగా కొనసాగాల్సిన రూ.30,000 కోట్ల ఆర్‌ఎస్‌పీ విస్తరణ ప్రణాళిక కార్యాచరణ స్తంభించి పోయింది. ఈ ప్రాజెక్టు వేగవంతం చేస్తే ప్లాంట్ సామర్థ్యత రెట్టింపై ఉక్కు ఉత్పత్తిలో జాతీయ స్వావలంబనను బలోపేతం చేస్తుంది. వేలాది ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. సత్వర పరిష్కారంతో రౌర్కెలా స్టీల్ ప్లాంట్ విస్తరణ పట్ల రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని అభ్యర్థించారు. అలాగే రౌర్కెలాలో పూర్తిస్థాయి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

# ఘనంగా ప్రపంచ పొఖాలో దివాస్


చద్దన్నం, వివిధ కూరలు


తనూజా శతపతిని సత్కరిస్తున్న ఎస్పీ జితేంద్ర పండా


చద్దన్నం తింటుస్తున్న ఎస్పీ జితేంద్రపండా దంపతులు

పర్లాకిమిడి: ఒడిశా జగన్నాథ సంస్కృతిలో పకాలన్నం (చద్దన్నం) తినడం ఒక ఆనవాయితీ అని, స్వయంగా ఈ రోజు జగన్నాథ స్వామి పకాలన్నం, తోటకూర నైవేద్యంగా సేవాయత్‌లు అందజేస్తారని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి స్థానిక రాజావారి ప్యాలస్‌లో ఉంటున్న యెటెక్ కంప్యూటర్ కార్యాలయంలో ప్రపంచ పొఖాలొ (చద్దన్నం) దినోత్సవాన్ని ప్రారంభించారు. చద్దన్నం తినడం ఎండా కాలంలో శరీరానికి ఎంతో ఆరోగ్యకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాడీ, బినోదిని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్ పట్నాయక్, విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగి హరిమోహన్ పట్నాయక్, బిచిత్రానంద బెబర్తా ముఖ్యవక్తగా వ్యవహరించారు. ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శతపథి ఆధ్వర్యంలో మహిళలు పోకాలో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పకాలన్నం, తోటకూర జావ, వివిధ వంటకాల పోటీల్లో విజేతలైన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రగతి మహిళా సంఘటన్ నిర్వాహకులు తనూజా శతపథిని సత్కరించారు. అనంతరం విద్యార్థులు కవితా పఠనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పకాలన్నం, పెరుగు, తోటకూర, బంగాళాదుంపల పచ్చడి, తదితర ఆహార పదార్థాలను ఆరగించారు. ఈ కార్యక్రమాన్ని లోకనాథ మిశ్రా, అధ్యక్షురాలు కల్పనా పట్నాయక్, మురళీ పొరిచ్చా తదితరులు పర్యవేక్షించారు.

### న్యూడ్ ఫొటోలతో బెదిరిస్తున్న యువకుడి అరెస్టు

జయపురం: న్యూడ్ ఫొటోలు పంపుతూ బెదిరిస్తున్న ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం వెల్లడించారు. ఆయన వివరణ ప్రకారం గత ఫిబ్రవరి 28 వ తేదీన ఒక వ్యక్తి వచ్చి లిఖిత ఫిర్యాదు చేశారని, అందులో ఒక ఏడాది కిందట తెలియని వ్యక్తి తన కుమార్తెకు న్యూడ్ ఫొటోలు పంపాడని పేర్కొన్నట్లు తెలిపారు. ఓ నంబర్ ద్వారా ఇలా ఫొటోలు, వీడియోలు పంపిస్తున్నాడని, సోషల్ మీడియాలో పెట్టి బెదిరిస్తున్నాడని ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజఖరియర్‌కు చెందిన మహమ్మద్ తాహీర్ అనే వ్యక్తి ఇలా ఫొటోలతో బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం రాత్రి అరెస్టు చేశారు. నిందితుడి నుండి రియల్‌మే 11 ప్రొ మొబైల్ ఫోనులు, రియల్‌మే టేబ్ 9, ఓలివ్ గ్రీన్ కలర్,ఒక ఇన్‌ఫిక్స్ లేప్‌టాప్,ఒక హార్డ్ డిస్క్ (1 టిబి ) సీగేట్, ఒక 256 జీబీ హార్డ్ డిస్, రెండు 16 జీబీల పెన్‌డ్రైవ్‌లు, మూడు 32 జీబీల పెన్ డ్రైవ్‌లు, ఒక 4 జీబీ హెచ్‌పి పెన్ డ్రైవ్, ఒక 4 జిబి మైక్రో ఎస్‌డి మెమొరీ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### రాష్ట్రంలో కరోనాతో 50 మంది జర్నలిస్టులు మృతి

భువనేశ్వర్: మహమ్మారి కోవిడ్-19 సంక్రమణ కారణంగా 50 మంది జర్నలిస్టులు మరణించారని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాజి గురువారం సభలో వెల్లడించారు. విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే సౌవిక్ బిస్వాల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఈ విషయం వెల్లడించారు. కరోనాతో మృతి చెందిన 49 మంది జర్నలిస్టుల బంధువులకు ఒక్కొక్కరికి రూ. 15 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా మంజూరు చేశారు. కటక్ జిల్లాకు చెందిన ఒక జర్నలిస్ట్ కుటుంబానికి మాత్రమే రాష్ట్రం పరిహారం చెల్లించలేదని ముఖ్యమంత్రి తెలిపారు. వారు వేరే రాష్ట్రం నుంచి ఈ సహాయం పొందారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సభలో ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో కోవిడ్ కారణంగా గంజాం జిల్లాలో అత్యధికంగా 10 మంది జర్నలిస్టులు మృతి చెందారు. భువనేశ్వర్ సహా ఖుర్దా జిల్లాలో 8 మంది దీని బారిన పడి మరణించారు. సుందర్‌గఢ్ జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

# భూమి విలువ తగ్గించాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రియల్ ఎస్టేట్ సభ్యులు

జయపురం: భూమి విలువలు (రిజిస్ట్రేషన్ చార్జీలు) పెంచటం వలన క్రయ, విక్రయాల సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయని జయపురం రియల్ ఎస్టేట్ డవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు బుధవారం భువనేశ్వర్‌లో రెవెన్యూ మంత్రి సురేష్ పూజారిని కలిసి విన్నవించారు. భూములు కొనటం, ప్లాటులు వేయటం నిలిచిపోయాయని మంత్రికి వివరించారు. టౌన్ ప్లానింగ్, మున్సిపాలిటీ అనుమతులు ఉన్నప్పటికీ వాటికి పట్టాలు లభించకపోవటం వలన అమ్మేందుకు తహసీల్దార్ అనుమతి లభించటం లేదన్నారు. బహుళ ఆదివాసీ వెనుక బడిన కొరాపుట్ జిల్లాలో కటక్, భువనేశ్వర్‌తో సమానంగా భూమి రేట్లు పెరిగాయన్నారు. భూముల క్రయవిక్రయాలు నిలిచిపోతున్నందున పిల్లల చదువులు, వివాహాలు చేసేందుకు ఆదివాసీ, నిరుపేద సంప్రదాయ ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో భూ క్రయవిక్రయాలు జరిగి వాటికి పట్టాలు లభించకపోవటంతో కొనుక్కొనేవారు ఇళ్ల నిర్మాణానికి బ్యాంక్ రుణాలు లభించక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జయపురం తాలూకాలో కుంతర్ కల్ మౌజలో పంట భూమిని బెంజ్ మార్క్ విలువ కన్నా అధికంగా పెంచారని, దీనిపై మరోసారి ఆలోచించాలని మంత్రిని కోరారు. ఈ సమస్యలపై ఏప్రిల్ నాటికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కొరాపుట్ జిల్లా రియల్ ఎస్టేట్ డవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు హిమాంశు మహాపాత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ పాణిగ్రాహి, విక్రమ సాహు, అరుణ వర్మ, పాల్గొన్నారు.

# మా మంగళ మందిరానికి ప్రభుత్వ గుర్తింపు


కొలువుదీరిన ట్రస్ట్ కార్యవర్గం


మందిరం


పూజలందుకుంటున్న అమ్మవారు

రాయగడ: ప్రజలకు శుభాలు చేకూర్చే మా మంగళ అమ్మవారి దేవతా మూర్తిని 35 ఏళ్ల క్రితం స్థానిక రింగ్ రోడ్డులో ఆ ప్రాంతవాసులంతా ప్రతిష్టించి మందిర నిర్మాణం చేపట్టారు. నిత్య పూజలు విశేష కార్యక్రమాలతో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ ఆలయాన్ని ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ శాఖ గుర్తించింది. ఈ సందర్భంగా తొలిసారిగా మందిర ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా స్థానిక రాజేంద్ర కుమార్ సాహుని నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. గురువారం ఆలయ ప్రాంగణంలో అధ్యక్షుడిగా నియమితులైన సాహు బాధ్యతలు స్వీకరించారు. ఈయనతో పాటు మరో పదిమంది ట్రస్ట్ సభ్యులను నియమిస్తున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ న్యాయవాది బినాయక్ కర్, రామకృష్ణ పండా, గోపినాథ్ గౌడొ, రవీంద్ర సాహు, మంజుశ్రీ ముఖర్జి, పుష్పభాను దాస్, నరేష్ పట్నాయక్, రామనాథ్ పురోహిత్, రంజిత్ బిసోయి, లలిత్ జెన్న ఉన్నారు. మందిర ప్రాంగణంలో బాధ్యతలు చేపట్టిన ట్రస్ట్ సభ్యులకు స్థానికులు అభినందించారు.

# రాష్ట్రంలో బంగారం నిక్షేపాలు పుష్కలం: మంత్రి


బిభూతి జెనా

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగారం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఉక్కు, గనుల శాఖ మంత్రి బిభూతి జెనా సభలో లిఖిత పూర్వకంగా ప్రకటించారు. సుందర్‌గఢ్, నవరంగ్‌పూర్, అంగుల్, కొరాపుట్ ప్రాంతాలలో బంగారు గనులు ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. మల్కన్‌గిరి, సంబల్‌పూర్, బౌద్ జిల్లాల్లో కూడా బంగారు గనులు ఉన్నాయన్నారు. రాష్ట్రం ఖనిజ నిక్షేపాలతో తులతూగుతుంది. చైనాకు రాష్ట్రం ఇనుప ఖనిజం ఎగుమతి చేస్తుందని మంత్రి తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరం మార్చి నెల 10 నాటికి రూ. 1019 కోట్ల 80 లక్షల ఆదాయం సమకూరిందని మంత్రి విశ్లేషించారు.

**మద్యం ప్రభావంతో రోడ్డు ప్రమాదాలు**

రాష్ట్రంలో మద్యపానం ప్రభావంతో సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు కలవరపరుస్తున్నాయి. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రంగా 56 వేల 831 రోడ్డు ప్రమాదాలు సంభవించినట్లు రాష్ట్ర రవాణా విభాగం మంత్రి బిభూతి జెనా తెలిపారు. ఈ ప్రమాదాల్లో 27,167 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50,041 మంది గాయపడ్డారని మంత్రి సభలో లిఖితపూర్వక సమాధానం ప్రవేశ పెట్టారు. రాష్ట్రంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్య పెరుగుతోంది. 'మద్యపానం చేసి వాహనాలు నడపడం వల్ల గత 3 ఏళ్లలో 2,127 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. 22,672 మంది మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. వాహన చట్టం నిబంధనల ఉల్లంఘనల కింద 11,377 మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేసినట్లు మంత్రి ప్రకటించారు.

# విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా


విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న మీటర్ రీడర్లు

అరసవల్లి: విద్యుత్ మీటర్ల రీడింగ్ బాధ్యతలను నుంచి క్రమక్రమంగా తప్పించేలా యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలు దారుణమని, ఈ చర్యలతో వేలాది మంది మీటర్ రీడర్లు రోడ్డున పడనున్నారని బాధిత సంఘ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా విద్యుత్ మీటర్ల రీడర్ల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా నాట్ స్కాన్ మీటర్లు ఉన్నప్పటికీ, వాటిని మార్చకుండా వెరిఫై చేయకుండానే..మేమే స్కాన్ చేయడం లేదన్న సాకుతో భారీగా జీతాల్లో కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థకు చెందిన మొబైల్స్ కూడా రీడర్లుకు ఇవ్వకుండా ప్రణాళికబద్ధంగా వేటు వేసేలా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలను ఇవ్వాలని తామంతా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేస్తున్నామని.. తక్షణమే యాజమాన్యం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఎస్.అఖిల్, జి.తేజ, ఎల్.భాస్కర్, ఆర్.రమేష్, ఎన్.గోవిందరావు, పి.సంతోష్, బి. దేవీవరప్రసాద్ తదితరులున్నారు. అనంతరం విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావులకు వినతిపత్రాలు అందజేశారు.

### టీజీఐ పరిశ్రమలో అగ్ని ప్రమాదం


పరిశ్రమను కమ్మేసిన పొగ

గార: మండలంలోని సతివాడ జంక్షన్‌లో ట్రాన్స్‌వర్డ్ గార్నెట్ ఆఫ్ ఇండియా(టీజీఐ) ఇసుక పరిశ్రమలో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. యూనిట్ బ్లాక్ పక్క ఉన్న స్టాకు గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమ వద్దకు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. పెద్ద ఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో సాయంత్రం వరకు సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు అగ్నిమాపక శాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. ఇసుక లోడింగ్ చేసే బ్యాగులు కాలిపోయినట్టు ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు.

### నేడు డీఎంఈ రాక

శ్రీకాకుళం: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాలలను పరిశీలించి వైద్యులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం జిల్లాలోని మరికొన్ని ఏరియా ఆస్పత్రులను పరిశీలించే అవకాశం ఉంది.

### నిమ్మాడలో పట్టపగలే చోరీ

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ ప్రధాన రహదారిలో మంత్రి సోదరుడి ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న శిమ్మ కృష్ణారావు ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. కోటబొమ్మాళి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు తన భార్య లక్ష్మీతో కలిసి పొలం పనికి వెళ్తూ ఇంటి తాళం చెవిని ఆవరణలో పెట్టి వెళ్లిపోయారు. కుమారుడు, కోడలు పనుల నిమిత్తం నరసన్నపేట వెళ్లారు. తాళం చెవి ఇంటి ఆవరణలో పెట్టడం గమనించిన దుండగులు దర్జాగా తాళం తీసి ఇంట్లో ప్రవేశించి 6 తులాల బంగారం, కొంత నగదు అపహరించుకుపోయారు. కృష్ణారావు పొలం పనులు ముగించి ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం, నగదు పోయినట్లు గుర్తించారు. అనంతరం కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# దివ్యాంగులకు తప్పని పాట్లు


నిరాశలో దివ్యాంగులు

ఇచ్ఛాపురం టౌన్: వైకల్య ధ్రువపత్రాల పరిశీలన కోసం ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి గురువారం వచ్చిన దివ్యాంగులకు అధికారుల తీరు కారణంగా ఇబ్బందులు తప్పలేదు. కంచిలి మండలం బెల్లుపడ గ్రామానికి చెందిన దివ్యాంగులు బి.సీతమ్మ, సీహెచ్ పాపారావు, కె.హరికృష్ణ, సీహెచ్ లత, నర్తు గీతలు అంగవైకల్య ధ్రువపత్రం కోసం దరకాస్తు చేసుకున్నారు. వైద్య పరిశీలనకు గురువారం ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి హాజరుకావాలని నమోదుపత్రంలో సమయం కేటాయించారు. తీవ్ర వ్యయ ప్రయాసలకోర్చి దివ్యాంగులు రాగా.. పరిశీలకులు రాలేదని సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయం అధికారులు ముందుగా చెప్పకపోవడంతో సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఆటోలో రావాల్సి వచ్చిందని వాపోయారు. కాగా, దివ్యాంగులకు బుధవారం మాత్రమే వైద్య పరిశీలన చేస్తారని వైద్యాధికారి దేవేంద్రరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ముందుగానే ఆయా మండల అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

## క్లుప్తంగా

### గేట్‌లో ఆలిండియా 451వ ర్యాంక్ • అర్తమూరు యువకుడి ప్రతిభ


గేట్‌లో సత్తా చాటిన నరసింహనాయుడు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన గేట్ –2025 (గ్రాడ్యుయేట్ యాప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)ఎంట్రన్స్ టెస్ట్‌లో గరివిడి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన యువకుడు సుంకరి నరసింహనాయుడు ప్రతిభ చాటాడు. మెకానికల్ విభాగంలో ఆలిండియా స్థాయిలో 451వ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న గేట్ ఎంట్రన్ పరీక్ష జరగ్గా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి.

### తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు


తల్లిదండ్రులకు అప్పగించిన శివసాయితో ఎస్సై రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస ఎస్సీ వసతి గృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి పత్తిగూల శివసాయిని స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శివసాయి ఫిబ్రవరి 17న రావివలస ఎస్సీ వసతి గృహంనుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు తండ్రి పోలయ్య ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. శివసాయి కోసం గాలింపు చేపట్టగా సీతానగరం మండలం అంటిపేటవద్ద ఆచూకీ లభించడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, తల్లిదండ్రులకు ఎస్సై అప్పగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఎస్సైకి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.


### ఈహెచ్‌ఎస్ సేవలందించడంలో అలసత్వం తగదు

• ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ డి.రాంబాబు


ఆస్పత్రిలో మహిళతో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ రాంబాబు

విజయనగరం ఫోర్ట్: ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కు సంబంధించి ప్రతి రోగికి వైద్యసేవలు అందించాలి. వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) జిల్లా మేనేజర్ డి.రాంబాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ నెట్‌వర్క్ ఆస్పత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవల గురించి ఆరా తీశారు. చికిత్స సకాలంలో అందిస్తున్నారా? నాణ్యమైన భోజనం పెడుతున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదనంగా డబ్బులు ఏమైనా అడుతున్నారా అని రోగులను ఆరా తీశారు. ఆస్పత్రిలో ఏ సమస్య ఉన్నా వెంటనే ఆరోగ్య మిత్రను కలవాలని రోగులకు చెప్పారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ ఎ.భానుప్రసాద్ పాల్గొన్నారు.

### అట్రాసిటి కేసుపై విచారణ


ఫిర్యాదుదారురాలు కృష్ణమ్మ ఇంటివద్ద ఆరా తీస్తున్న డీఎస్పీ మీరాకుమార్

వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామానికి సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై విజయనగరం డీఎస్పీ మీరాకుమార్ నేతృత్వంలో గురువారం విచారణ చేపట్టారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. మార్చి 11న గుడివాడలో వేణుగోపాలస్వామి తీర్థం సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ వద్ద జరిగిన గొడవలో తన కుమారుడిని కులం పేరుతో వల్లంపూడి ఎస్సై బి.దేవి దూషించి గాయపర్చినట్లు గ్రామానికి చెందిన గుడివాడ కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ పి.మీరాకుమార్, రూరల్ సీఐ అప్పలనాయుడు గ్రామంలో గురువారం విచారణ నిమిత్తం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ వద్దకు ఫిర్యాదుదారు కృష్ణమ్మ హాజరుకాకపోవడంతో డీఎస్పీ మీరాకుమార్ ఫిర్యాదు దారు ఇంటికి వెళ్లి ఆరా తీయగా కుటుంబసభ్యులు ఉన్నారు కానీ ఫిర్యాదుదారు లేకపోవడంతో గ్రామ సభకు చేరుకున్నారు. గ్రామసభలో వేచి ఉన్నప్పటికీ సాక్షులు హాజరుకాకపోవడంతో సర్పంచ్ మిడతాన గోపి, ఏపీ దళితకూలీ రైతు సంఘం నాయకుడు గాలి ఈశ్వర్రావు తదితరులతో మాట్లాడిన అనంతరం డీఎస్పీ, సీఐ వెనుదిరిగారు.

### మారిక హెచ్‌ఎం సస్పెన్షన్

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరి శిఖరంపై ఉన్న మారిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యాలనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని అందిన ఫిర్యాదుల మేరకు ఎంఈఓతో విచారణ నిర్వహించారు. అనంతరం సస్పెండ్ చేస్తూ డీఈఓ ఆదేశాలు ఇచ్చారు.

# పొజిషన్ ఉంటేనే నిధుల మంజూరు..!

• హౌసింగ్ నిధులు ఒక్కో లబ్ధిదారుకు రూ.2.50లక్షలకు పెంపు
• కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరి
• తలలు పట్టుకుంటున్న ఇళ్ల లబ్ధిదారులు


గుమ్మలక్ష్మీపురం మండలంలో సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్‌టీఆర్ హౌసింగ్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతంలో రెండున్నర సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు కేటాయించనుంది. హౌసింగ్‌లో వచ్చే నిధులను ఒక్కో లబ్ధిదారుకు రూ.2.50లక్షలకు పెంచినట్లు పక్క ప్రభుత్వం, మరోపక్క అధికారులు చెబుతున్నారు. వాటికి తోడు బీసీ, ఎస్సీ కులాల లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ కులాలకు చెందిన లబ్ధిదారులకు అదనంగా రూ.70వేలు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ క్రమంలో హౌసింగ్ పథకం అమలు వేగం పుంజుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంతా ఒక ఎత్తయితే హౌసింగ్ పథకంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ కులాల ధ్రువీకరణ పత్రాలు, వారి అనుభవంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ అధికారులతో పొజిషన్ సర్టిఫికెట్లు జతచేయాలన్న నిబంధన పెట్టారు. దీంతో లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు స్థలాల పొజిషన్ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో లబ్ధిదారులకు ఇబ్బందులు రావడం లేదు కానీ పొజిషన్ సర్టిఫికెట్ మంజూరులో రెవెన్యూ అధికారులు పలు ప్రశ్నలు వేస్తున్నారు. స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్, అగ్రిమెంట్లు ఉండాలని, డీకేటీ, గ్రామకంఠం భూములకు ఇవ్వమని చెబుతున్నారు. గ్రామాల్లో పేద రైతులకు వారి పొలాల వద్ద హౌసింగ్ ఇంటి నిర్మాణానికి స్థలాలు ఉన్న భూములకు వన్‌బీ ఉండడంతో మూడు సెంట్ల స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తామని రెవెన్యూ అధికారులు మెలిక పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు తమ గోడు ఎవరికీ చెప్పుకోవాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### గందరగోళంలో హౌసింగ్ అధికారులు

పార్వతీపురం మన్యం జిల్లాలో హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి. ప్రతి వారం రోజులకు ఈ పథకంలో సాధించిన నివేదికలు ఇవ్వండి అంటూ హౌసింగ్ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారుల వెంట పడుతున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఈ పాటికే హౌసింగ్ నిర్మాణాలు పునాదులు దాటి గోడస్థాయికి వచ్చి ఉండేవి. కానీ లబ్ధిదారుల సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే నిధులు మంజూరు చేయాలనే నిబంధన ఉండడంతో ఇక్కడే ఈ పథకం ముందుకు కదలకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. దీంతో ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక, రెవెన్యూ అధికారులను ప్రాథేయపడలేక హౌసింగ్ అధికారుల్లో గందరగోళం నెలకొంది.

#### జిల్లాలో 18,056 మంది లబ్ధిదారుల గుర్తింపు

పార్వతీపురం మన్యం జిల్లాలో 18,056 మంది హౌసింగ్ పథకంలో లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు సర్వే చేశారు. సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు హౌసింగ్ పథకంలో ఇంటి నిర్మాణం మంజూరు చేసేందుకు ఆ స్థలాల్లో పొజిషన్ సర్టిఫికెట్ల మెలిక పెట్టడంతో అవి నిలిచిపోతున్నాయి. జిల్లాలో గల 15 మండలాల్లో అధికారులు విస్తృతంగా సర్వే నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. సుమారు 13వేల మందికి పైగా లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు లేవన్న కారణంగా హౌసింగ్ బిల్లులు అందుతాయో? లేదోనన్న ఆందోళన నెలకొంది.

#### అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

హౌసింగ్ పథకంలో భాగంగా సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరి. సొంత స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేస్తున్నారు. ఆధాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తేనే లబ్ధిదారులకు హౌసింగ్ నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తున్నాం.

– పి.ధర్మ చంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

# నిందితులకు రిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

• వృద్ధురాలిని హతమార్చిన కేసులో నలుగురి అరెస్ట్

గజపతినగరం: మెంటాడ మండలం రెల్లిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు రాళ్లపూడి అంకమ్మను(75) హతమార్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం గజపతినగరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మెంటాడ మండలం రెల్లిపేటలో తన నివాస గృహంలో 16.3.2025న వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు. శవపంచనామా అనంతరం వృద్ధురాలిని గొంతునులిమి చంపినట్లు వైద్యుల రిపోర్టు రావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను గాలించి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. గురువారం ఉదయం 11గంటలకు నలుగురు నిందితులైన దానాల రాము, దానాల దుర్గారావు, దానాల రాములమ్మ, పొట్నేటి రామప్పుడు అలియాస్ బొడ్డులు పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌ఓల సమక్షంలో లొంగిపోయినట్లు చెప్పారు. మృతురాలు అంకమ్మ ఇంటి చుట్టుపక్కల ఉన్న వారికి నగదు అప్పుగా ఇస్తూ ఉంటుందని అందులో భాగంగా దానాల రాములమ్మ అప్పుఅడగ్గా ఆమె తిరస్కరించింది. దీంతో రాములమ్మతో పాటు మరో ముగ్గురు తోడై వృద్ధురాలి వద్ద ఉన్న బంగారం ముక్కుపుడక, రూ.740లు దోచుకుని ఆమెను హతమార్చినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన స్థానిక సీఐ జీఏవీ రమణ, ఆండ్ర ఎస్సై కె.సీతారామ్, గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావుల తో పాటు ఇతర సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్‌తో పాటు తాను అభినందిస్తున్నట్లు చెప్పారు.

## ఆధునిక పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు

• జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు
• వర్సిటీలో మెక్‌అనో జాతీయ సదస్సు ప్రారంభం

విజయనగరం అర్బన్: పరిశ్రమ రంగానికి అవసరమైన ఆధునిక పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ సంయుక్త నిర్వహణలో 'మెక్ అనో ఎంఎంఎక్స్ ఎక్స్‌వీ 2025' అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరికరాలు అవి పని చేస్తున్న తీరు తదితర అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచడానికి ఇలాంటి సదస్సులు విద్యార్థులకు దోహదపడతాయన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రసాద్, వి.మణికుమార్, డాక్టర్ సి.నీలిమదేవి ఫ్యాకల్టీ సమన్వయకర్తలుగా,, స్టూడెంట్ కో ఆర్డినేటర్స్‌గా కె.కౌశిక్, పి.ప్రగతి వ్యవహరించారు.

## ఇద్దరికి గాయాలు


ప్రమాదం జరిగిన ప్రదేశంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం, పక్కన కర్రల లోడ్‌తో ట్రాక్టర్

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తాలాడ గ్రామానికి చెందిన వంకల రాజారావు, సిరిపురం గ్రామానికి చెందిన గుణుపూర్ గోవింద, శంకరపేట గ్రామానికి చెందిన కోరాడ రాజులు ఇదే మండలంలోని మల్లయ్యపేట గ్రామంలో కూలి పనులకు వెళ్లి పనులు ముగించిన అనంతరం గుళ్లసీతారాపురంలో లైవ్‌ఫిష్ సెంటర్లో చేపలు కొని అయ్యప్ప టెంపుల్ దగ్గర బైక్‌తో ఆగి ఉన్నారు. అ సమయంలో కర్రల లోడ్‌తో ట్రాక్టర్ వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వంకల రాజారావు, గుణుపూర్ గోవిందలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108 ద్వారా రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. వంకల రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

## పోక్సో కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోవద్దు


ఖైదీల నుద్దేశించి ప్రసంగిస్తున్న న్యాయమూర్తి అరుణశ్రీ

బొబ్బిలి: పోక్సో కేసుల్లో ఇరుక్కుని మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ హితవు పలికారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్‌జైలును ఆమె సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడి సత్ప్రవర్తనపై తెలియజేశారు. న్యాయ సహాయం కావాల్సిన వారు ఏ విధంగా పొందవచ్చో వివరించారు. చెడు ఆలోచనల వల్ల ఎలాంటి ఉపద్రవాలు ఎదుర్కోవాల్సి వస్తుందో, వాటికి దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా ఎలా జీవించాలోనన్న విషయాలను తెలియపర్చి వారిలో పరివర్తన, చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు. సబ్‌జైలర్ పాత్రో, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రెండు గడ్డివాములు దగ్ధం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో కర్రి అప్పలనాయుడికి చెందిన రెండు గడ్డివాములు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. పశువులకు ఏడాదికి సరిపోయే గడ్డిని సమకూర్చుకున్నానని, అగ్ని ప్రమాదంలో గడ్డి మొత్తం కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. గడ్డివాములు కాలిపోతున్న విషయమై స్థానికులు బాడంగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10వేల నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

## గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

• విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయిని ధ్వంసం చేయిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోందని విశాఖ రేంజ్ పోలీసు డీఐజీ గోపీనాథ్ జెట్టి స్పష్టం చేశారు. ఈ మేరకు గడిచిన ఎనిమిది నెలల్లో మూడు దశల్లో పట్టుబడిన 7 వేల 378 కేజీల గంజాయిని ధ్వంసం చేశామని డీఐజీ తెలిపారు. విశాఖ పోలీస్ రేంజ్ పరిధి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతకుంకాంలో గురువారం మూడు జిల్లాల్లో పలు కేసుల్లో సీజ్ చేసిన గంజాయి నిర్మూలన కార్యక్రమం జరిగింది. 226 కేసులలో సీజ్ చేసిన 7378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, ,శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

## దైవదర్శనానికి వెళ్తూ ఇద్దరు మహిళల మృతి


రౌతు సూరప్పమ్మ (ఫైల్)


అప్పలనారాయణమ్మ (ఫైల్)

గుర్ల: మండలంలోని పెనుబర్తికి చెందిన 15 మంది, గరివిడి మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన 30 మంది తమిళనాడులోని రామేశ్వరం దైవదర్శనానికి బస్సులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. తెలంగాణలోని మెదక్ జిల్లా శంకరంపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రోడ్డు పక్కన ఆగి ఉన్న ప్రయాణికుల బస్సును డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి బస్సు వెనుక భాగంలో ఉన్న కూర్చున్న మహిళలు మృతిచెందారు. మృతిచెందిన వారిలో గుర్ల మండలంలోని పెనుబర్తికి చెందిన రౌతు సూరప్పమ్మ (60), గరివిడి మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన మీసాల అప్పలనారాయణమ్మ (50) ఉన్నారు. అలాగే పెనుబర్తి గ్రామానికి చెందిన బెల్లాన జగన్నాథం, సుంకరి రామలక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి.

### బావిలో పడి ఒకరు...


మజ్జి సత్యనారాయణ (ఫైల్)

పార్వతీపురం రూరల్: రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి నేలబావిలో శవమై తేలాడు. ఈ మేరకు స్థానిక రూరల్ ఎస్సై బి.సంతోషి గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సారిక వీధికి చెందిన మజ్జి సత్యనారాయణ(54)ఈనెల 18న ఆస్పత్రికి అని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తరువాత ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు పరిసర గ్రామాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు భార్య పార్వతి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం పార్వతీపురం రూరల్ పరిధిలో ఉన్న బ్యాంక్‌ఆఫ్ బరోడా సమీపంలో నేలబావిలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మృతదేహాన్ని సత్యనారాయణగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులలో ఒకరు మరణించడంతో మనస్తాపానికి గురై సత్యనారాయణ మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలలో 'సునీత' విజయోత్సవాలు


సునీత విలియమ్స్ విజయోత్సవాల్లో బాలికలు, ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: అంతరిక్షం నుంచి సునీత విలియమ్స్ క్షేమంగా చేరుకున్న సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విజయోత్సవాలు ఘనంగా జరిగాయి. తొలుత పాఠశాల ప్రాంగణంలో బాలికలు సామూహిక ప్రదర్శన చేసి బాణసంచా కాలుస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పి.రమణమ్మ మాట్లాడుతూ యువత సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బాలికల్లో స్ఫూర్తిని పెంచే విధంగా ఆమె చూపిన పట్టుదల, దృఢ సంకల్పం నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.వెంకట్రావు, ఈ.రాము నాయుడు, పి.ఉమారాణి, ఎంవీ లక్ష్మీనరసమ్మ, సీహెచ్.రత్నం, యూవీఎస్ రాజు, శ్రీరంగాచార్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటను వల్లంపూడి పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు పోలీసులు నిర్వహించిన దాడుల్లో గ్రామసమీపంలోని తోటల్లో 500 లీటర్ల బెల్లం ఊట పట్టుబడింది. దీంతో బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

# ఆదుకోకోంటే ఉద్యమమే


విజయరాయిలో నిర్వహించిన కోకో రైతుల రాష్ట్ర సదస్సులో చేయి కలిపిన రైతులు


రాష్ట్ర నలుమూలల నుంచి సదస్సులో పాల్గొన్న రైతులు

• తేల్చిచెప్పిన కోకో రైతులు
• కొనుగోలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్
• విజయరాయిలో రాష్ట్ర సదస్సుకు పెద్దసంఖ్యలో రైతుల హాజరు

పెదవేగి: కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కోకో రైతుల రాష్ట్ర సదస్సు హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. బొల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, ఈదుగంటి శ్రీనివాసరావు అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ సదస్సులో కోకో రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కోకో రైతులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

#### కంపెనీల సిండికేట్‌తో దోపిడీ

కోకో గింజల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉందని, ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

#### కోకో రైతులు సంఘటితం కావాలి

కోకో రైతులంతా సంఘటితంగా లేకపోవడం వల్లే కంపెనీలు సిండికేట్ అయి ఇబ్బంది పెడుతున్నాయని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు.

#### 24న ధర్నాలు, రాస్తారోకోలు

కోకో రైతుల సమస్యలపై ఈ నెల 24, 25 తేదీల్లో ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించాలని, ఎంపీలు ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని, సమస్యను పరిష్కరించకపోతే కోకో గింజలు కొనుగోలు చేస్తున్న కంపెనీల గొడౌన్ల ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోకో రైతుల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది.

## మీటర్ రీడింగ్ కార్మికుల పొట్ట కొట్టొద్దు..

• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్



విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపడుతున్న మీటర్ రీడర్స్

విజయనగరం గంటస్తంభం: స్మార్ట్‌మీటర్లు తీసుకొచ్చి వేలాది మంది విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే కార్మికుల పొట్ట కొట్టొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. గురువారం స్థానిక దాసన్నపేటలోని విద్యుత్ భవన్ ముందు మీటర్ రీడర్స్ యూనియన్ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో సుమారు 4500 మంది విద్యుత్ మీటర్ రీడర్స్ 20 సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో కార్మికులందరికీ అన్యాయం జరుగుతుందని చెప్పారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించి.. నేడు బీజేపీతో జత కట్టడం సిగ్గుచేటన్నారు. ఒక్కో సర్వీస్‌కు కేవలం రూ.3.60 పీస్ రేటుతో నెలకు రూ. 6 నుంచి 10 వేల రూపాయల లోపు మాత్రమే వేతనం పొందుతున్న రీడర్స్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఆందోళనలను ఉధృతం చేస్తామని చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, పసుమర్తి శ్రీకాంత్, (ఎస్.కోట సబ్ డివిజన్), విజయనగరం సబ్ డివిజన్ గోక రమణ, (గజపతినగరం సబ్ డివిజన్) ఆది, రీడింగ్ కార్మికులు పాల్గొన్నారు.